క్లుప్తంగా

నెల్లిపాక ఎలక్ట్రికల్ జేఈగా పరశురాముడు



ఎటపాక: మండలంలోని నెల్లిపాక సెక్షన్ ఎలక్ట్రికల్ జేఈగా టి. పరశురాముడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు జేఈగా పనిచేసిన రాజ్‌కపూర్ కూనవరం బదిలీ కావటంతో అక్కడ జేఈగా పనిచేస్తున్న పరశురాముడిని నెల్లిపాక బదిలీ చేశారు. గృహ, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల వినియోగదారులు గమనించాలని కోరారు.

స్మృతివనానికి బెంచీల వితరణ

హుకుంపేట: గిరిజనులకు అన్ని విధాలుగా సేవలందించేందుకు ముందుంటామని డాక్టరు వైఎస్సార్, టీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తెడబారికి సురేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం తడిగిరి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ స్మృతివనంలో కూర్చోవడానికి తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో బెంచీలు వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సర్పంచ్ పెనుమల రంజిత్‌కుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రతతోనే ఆరోగ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మి, పాఠశాల సిబ్బంది

అరకులోయ రూరల్: పరిసరాలు పరిశుభ్రతతోనే మరింత ఆరోగ్యమని కాఫీ జూనియర్ లైజినింగ్ అధికారి వి.వి.కె.ఎం. లక్ష్మి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై చైతన్యవంతులు కావాలన్నారు. గ్రామస్థాయిలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించేందుకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, హెచ్ఎం మోహన్‌రావు పాల్గొన్నారు.

సమాజంలో గురువు స్థానం మహోన్నతం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో, ఇతర ఉపాధ్యాయులు

కొయ్యూరు: సమాజంలో గురువు స్థానం మహోన్నతమైనదని ఎంఈవో ఎల్. రాంబాబు తెలిపారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అప్పారావు, తలుపులు, మండల ఉత్తమ అవార్డు గ్రహీత శకుంతలను శుక్రవారం కొమ్మిక గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో సన్మానించారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రతీ విద్యార్థినిని ఉన్నత స్థానాల్లో ఉంచేందుకు గురువులు కృషి చేయాలన్నారు. గురువు స్థానం ఎప్పటికీ పదిలంగానే ఉంటుందన్నారు. హెచ్ఎం సంధ్య, పీఆర్టీయూ అసోసియేట్ అధ్యక్షుడు నారాయణరావు, ఏపీటీఎఫ్ మండల కార్యదర్శి జి. సత్యనారాయణ, ఉపాధ్యాయులు, పాఠశాల కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్‌కు ఆత్మీయ సత్కారం

దేవరాపల్లి: అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ ప్రయాణికులతో స్నేహ పూర్వకంగా మెలిగిన ఆర్టీసీ కండక్టర్‌కు అరుదైన గౌరవం లభించింది. మద్దిలపాలెం డిపోకు చెందిన సిహెచ్.రాజేశ్వరరావు దేవరాపల్లి 12డి బస్సులో కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. బస్సులోని ప్రయాణికులతో కుటుంబ సభ్యుడి మాదిరిగా కలిసిపోయి ప్రయాణికుల మనస్సును దోచుకున్నారు. ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న రాజేశ్వరరావు ఆఖరి రోజు శుక్రవారం విధులకు హాజరయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ప్రయాణికులు దేవరాపల్లిలో శుక్రవారం పూలమాల వేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం కండక్టర్ రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రయాణికులు తనపై చూపిన ప్రేమాభిమానాలను జీవితంలో మర్చిపోలేనన్నారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన అందరికీ రుణపడి ఉంటానన్నారు.

సోషల్ మీడియాలో ఏజెన్సీ అందాలు

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిట్టిబ్బాయ్



విద్యార్థులతో ఎంపీపీ, జెడ్పీటీసీ ఈశ్వరి, జానకమ్మ

పాడేరు: బీఏ హిస్టరీ గ్రూప్ విద్యార్థులను టూరిజం క్లబ్‌గా ఏర్పాటు చేసి, ఏజెన్సీ అందాలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసి సోషల్ మీడియా ద్వారా అందరికీ తెలియజేస్తామని చరిత్ర విభాగాధిపతి జయలక్ష్మి తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టిబ్బాయ్ మాట్లాడుతూ విద్యార్థులు తరచుగా చారిత్రాత్మక ప్రదేశాలను సందర్శించి అక్కడ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాలన్నారు. ఏజెన్సీ పర్యాటక ప్రదేశాలను విదేశీయులు సందర్శించినప్పుడు స్థానిక విద్యార్థులు గైడ్‌గా వ్యవహరించి ఇక్కడ ప్రాంతాల విశిష్టతను వారికి తెలియజేయాలన్నారు. టూరిజం డే సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రసూల్, అధ్యాపకులు కోటేశ్వరరావు, రమేష్‌బాబు, మురళీధర్, నిర్మల, సుమిత్ర, సునీత, రాధాకుమారి, గౌరీశంకర్, గోవిందరాజు, శంకర్‌రావు, అచ్యుత్‌రావు పాల్గొన్నారు.

పర్యాటక దినోత్సవ ర్యాలీ..

మారేడుమిల్లి: గ్రామంలోని ప్రధాన విధుల్లో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పలు శాఖల అధికారులు శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రధాన సెంటర్‌లో మానవహారం చేపట్టారు. మండల పరిషత్ పరిపాలన అధికారి జయంతి, బాలురు ఆశ్రమ పాఠశాల హెచ్ఎం రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న థింసా నృత్యాలు

డుంబ్రిగుడ: సుందర పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం వద్ద శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బాకా ఈశ్వరి, జెడ్పీటీసీ చటారి జానకమ్మ ఆధ్వర్యంలో థింసా నృత్యాలు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు సందడి చేశారు. ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ అనివార్య కారణాలతో కలెక్టర్ దినేష్‌కుమార్ ఇక్కడకు రాకపోవడంతో విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఇక్కడకు విచ్చేసిన పర్యాటకులకు స్వాగతం పలికామన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ ఆధ్వర్యంలో చాపరాయిలో పోషకాహార స్టాల్‌ను ఏర్పాటు చేశారు. పోతంగి పంచాయతీ సర్పంచ్ వంతాల వెంకటరావు, వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్, వైఎస్సార్‌సీపీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు బంగురు శాంతి, పోతంగి వైస్ సర్పంచ్ జగ్గునాయుడు, బబిత పాల్గొన్నారు.



పౌష్టికాహార స్టాల్ ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పలు సమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టరేట్ వద్ద మండల ప్రజాప్రతినిధులు, నాయకులు

వై.రామవరం: మండలంలోని పలు సమస్యలపై ఎంపీపీ కడబాల ఆనందరావు ఆధ్వర్యంలో మండల ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం పాడేరులో కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అటవీశాఖ అడ్డంకులతో నిలిచిపోయిన మండలాభివృద్ధికి అతి ముఖ్యమైన వై.రామవరం నుంచి యార్లగడ్డ, మఠంభీమవరం మీదుగా గుర్తేడు రోడ్డు నిర్మించాలని, జన్‌మన్ సర్వేలో పీటీజీలకు ఇళ్ల మంజూరులో తప్పుడు సర్వేతో తిరస్కరించిన దరఖాస్తులకు రీసర్వే చేయించి న్యాయం చేయాలని, మండలంలో అతి ముఖ్యమైన పలు గ్రామాల రోడ్ల నిర్మాణం కోసం, తదితర సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్‌లు బచ్చలి చిన్నమ్ములు, పల్లాల రాజేశ్వరి, ముత్యాల నూకరాజు, నాయకులు పల్లాల తమ్మిరెడ్డి, కరణం కనకరాజు, వడ్లమూరి సత్తిబాబు తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు



క్రీడలో పాల్గొన్న ఉపాధ్యాయులు



బహుమతులు అందుకుంటున్న ఉపాధ్యాయిని

డుంబ్రిగుడ: యూటీఎఫ్ ఆధ్వర్యంలో కిల్లోగుడ ఆశ్రమ పాఠశాల మైదానంలో స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం క్రీడా పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ మాస్టారు ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఊపి ఆటల పోటీలను ప్రారంభించారు. ఉపాధ్యాయులకు వాలీబాల్, క్రికెట్, షటిల్, బ్యాడ్మింటన్, ఉపాధ్యాయినులకు కబడ్డీ, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్, క్యారం బోర్డు క్రీడలు నిర్వహించారు. విజేతలకు ప్రధానోపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయినులు క్రీడల్లో భాగస్వాములు కావడం ఆనందదాయకమని తెలిపారు. అన్ని వర్గాలను ఐక్యం చేసుకుంటూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడే లక్ష్యంతో యూటీఎఫ్ పనిచేస్తుందన్నారు. యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్. బాలకృష్ణ, కె.రాజారావు, జిల్లా కమిటీ సభ్యులు కన్నయ్య, నారాయణ, సీనియర్ ఉపాధ్యాయులు, ఎం బాబూరావు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదివితే విజయాలు

టాస్క్‌ఫోర్స్ అధికారి సురేష్



విద్యార్థులతో మాట్లాడుతున్న సురేష్

కొయ్యూరు: విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉండేందుకు ఇష్టపడి చదవాలని టాస్క్‌ఫోర్స్ అధికారి కె. సురేష్ సూచించారు. శుక్రవారం ఆయన కొయ్యూరు గురుకుల బాలుర జూనియర్ కళాశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే కష్టపడాలని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థితిలో ఉండాలన్నారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ ప్రథమ శ్రేణీలో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. మంచి అధ్యాపకులు ఉన్నారన్నారు. ప్రిన్సిపాల్ జగన్నాథరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాగునీటి కల్పనకు చర్యలు

- ఎంపీపీ ఉషారాణి



తాగునీటి ట్యాంకు ప్రారంభిస్తున్న ఎంపీపీ ఉషారాణి

అరకులోయ రూరల్: మండలంలో ఎక్కడైనా తాగునీరు సౌకర్యం లేకపోతే సంప్రదించాలని ఎంపీపీ రంజపల్లి ఉషారాణి తెలిపారు. మండగడ పంచాయతీ నందిగుడ గ్రామంలో మండల పరిషత్ నిధుల నుంచి రూ.1.40 లక్షలతో ఏర్పాటు చేసిన రక్షితనీటి పథకాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రజాప్రతినిధులు ముందుంటామని తెలిపారు. గిరిజన గ్రామాల్లో తాగునీరు కల్పనకు మండల పరిషత్ నిధులు వెచ్చించి నిర్మాణాలు చేపట్టామన్నారు. సర్పంచ్ జ్యోతి, వైస్ ఎంపీపీ రామన్న, నాయకులు బాలరాజు, కృష్ణ, నరసింహమూర్తి, గాసి తదితరులు పాల్గొన్నారు.

నేడు పవనగిరి క్షేత్రంలో పూజలు

అడ్డతీగల: తిరుమల పవిత్రను దెబ్బతీసే విధంగా లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేయడానికి శనివారం పవనగిరి క్షేత్రంలో పూజలు చేయనున్నట్లు ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఉదయం 9 గంటలకు పూజల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

హై రిస్క్ గర్భిణులకు సూచనలు



మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

కొయ్యూరు: హై రిస్క్ గర్భిణుల ఇంటికెళ్లి వారి తీసుకోవలసిన చర్యలను సూచించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సీడీపీవో విజయకుమారి సూచించారు. వారు ఎలాంటి ఆహారం తీసుకోవాలి. వైద్యం ఎలా పొందాలో వివరించాలని తెలిపారు. ఆమె శుక్రవారం చింతలపూడలో పోషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు తీసుకోవలసిన చర్యలను సూచించారు. గర్భిణులు విధిగా ఆస్పత్రికి వెళ్లి లేదా ఎంఎల్‌హెచ్‌పీల వద్దకు వెళ్లి హెచ్‌బీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులు సీమంతం చేశారు. అవగాహన కోసం మానవహారం ఏర్పాటు చేశారు. సూపర్‌వైజర్లు సునీత, మహాలక్ష్మి, బాలామణి, కొండమ్మ, ఎస్ఐ ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు



విద్యార్థినులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శశికాంత్

జి.మాడుగుల: వాతావరణ మార్పుల వల్ల సంభవించే వ్యాధుల పట్ల విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తినా తక్షణమే పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సంప్రదించాలని వైద్యాధికారి శశికాంత్ తెలిపారు. మండలంలోని గాంధీనగర్ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల, ఏకలవ్య పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. 60 మంది విద్యార్థినులకు సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న 12 మందికి ఆర్టీటీ పరీక్షలు నిర్వహించగా, ఎవరికీ మలేరియా లేదని తేలింది. వివిధ రోగాలతో బాధపడుతున్న 65 మంది విద్యార్థినులను డాక్టర్ శశికాంత్ పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో నడిగట్ల ప్రకాష్, హెల్త్ అసిస్టెంట్ జ్యోతిలాల్, ఏఎన్ఎంలు మార్తమ్మ, చిన్నతల్లి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షాలు

రాజవొమ్మంగి: మండలంలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం పూర్తిగా స్తంభించింది. అత్యవసర పనులపై ప్రయాణించే వారు వర్షాల కారణంగా నానా ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యవసాయ పనులు చేసుకొనే రోజు కూలీలు కూలి పనులు లేక అల్లాడుతున్నారు. మరో వైపు వ్యవసాయ పనులకు ఇబ్బడిముబ్బడిగా కురుస్తున్న వర్షాలు ఆటకం కలిగిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. వర్షాలకు మట్టిరోడ్లు చిత్తడిగా మారాయి. గుంతల్లో నీరు చేరి వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. ప్రస్తుతం ఖరీఫ్ వరిలో కలుపు తీత పనులు, రసాయన ఎరువులు వెదజల్లడం, క్రిమిసంహారక మందుల పిచికారీ పనులు నిలిచిపోయాయి. శనివారం నుంచైనా వర్షాలు తెరిపినిస్తే పనులు పూర్తి చేయాలని ఆశగా ఎదురు చూస్తున్నారు.

గంజాయి మహమ్మారిని తరిమికొట్టాలి



మాట్లాడుతున్న చింతపల్లి ఎస్సై అరుణ్‌కిరణ్, పక్కన సీఐ రమేష్, ప్రిన్సిపాల్ రామేశ్వరం

చింతపల్లి: గిరిజనుల జీవితాలను అన్ని విధాలుగా నాశనం చేస్తున్న గంజాయి మహమ్మారిని మన్యం నుంచి తరిమికొట్టాలని, ఇందుకోసం అంతా ఉద్యమించాలని ఎస్సై అరుణ్‌కిరణ్ తెలిపారు. గంజాయి నిర్మూలనలో భాగంగా శుక్రవారం స్థానిక ఏపీ గురుకుల కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు గంజాయి వంటి మత్తుపదార్థాల జోలికి వెళ్లవద్దని సూచించారు. కార్యక్రమంలో చింతపల్లి సీఐ రమేష్, ప్రిన్సిపాల్ జరామేశ్వరం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణ కార్యక్రమంలో దాతలు

చింతపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సరస్వతీ దేవి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. పాడేరుకు చెందిన దాతలు శివరాత్రి శ్రీనివాస్, తాంగుల జగత్‌రాయ్ తమ సొంత నిధులు వెచ్చించి ఇక్కడ సరస్వతీ దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. విగ్రహ దాతలను ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి, అధ్యాపకులు, విద్యార్థులు సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసపాత్రుడు, అధ్యాపకులు డాక్టర్ రమణ, లీలా పావని, కేజియా, రవీంద్రనాయక్, జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ రోడ్డు నిర్మాణంతో తీరిన ప్రజల కష్టాలు



నూతనంగా నిర్మించిన కాంప్లెక్స్ రహదారి, మురుగుకాలువ

అరకులోయ టౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రంగా భాసిల్లుతున్న అరకులోయలో ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. దశాబ్దాలుగా అరకులోయ నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, ఏపీ టూరిజం మయూరి, ఐటీడీఏ గోస్థాని అతిథి గృహానికి వెళ్లే ప్రజలతోపాటు పర్యాటకులు, అధికారులు తీవ్ర కష్టాలు ఎదుర్కొనేవారు. ఈ రోడ్డుపై మోకాళ్ల లోతులో నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ. 39 లక్షలు మంజూరు కావడంతో సీసీరోడ్డు, మురుగు కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికే పనులు దాదాపు పూర్తి చేశారు. ఈ రహదారి నిర్మాణం చేపట్టడంతో సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయాలను తనిఖీ చేసిన స్పెషల్ ఆఫీసర్



రాజవొమ్మంగి-4 అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న స్పెషల్ ఆఫీసర్ జాన్‌రాజ్

రాజవొమ్మంగి: మండల ప్రత్యేకాధికారి జాన్ రాజ్ శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-4లో చిన్నారులకు బాలింతలకు, గర్భిణులకు సకాలంలో పౌష్టికాహారం అందుతున్నది లేనిది పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో యాదగిరీశ్వర్రావు అధ్యక్షతన హౌసింగ్ ఏఈ, ఏఈలు, సూపర్‌వైజర్లు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో జరిగిన రివ్యూ మీటింగ్‌కు హాజరయ్యారు. పీఎంవై గ్రామీణ్ 2016-17లో మంజూరైన ఇళ్ల నిర్మాణాలకు వచ్చే ఏడాది మార్చి 31వ తేదీలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పౌష్టికాహారంతోనే మాతా శిశు సంరక్షణ

సీడీపీవో విజయగౌరి



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న సీడీపీవో విజయగౌరి



పోషకాహార వారోత్సవాల్లో సర్పంచ్ మాలన్న, ఎంపీటీసీ అప్పలరాజు

ఎటపాక: పౌష్టికాహారంతోనే మాతా శిశు సంరక్షణ సాధ్యమని ఎటపాక ప్రాజెక్టు సీడీపీవో విజయగౌరి తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాలను ఎటపాకలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కువ ఖర్చుతో పోషకాహారం తయారీని వివరించారు. సీడీపీవో మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లి, పిల్లలు, గర్భిణుల్లో పౌష్టికాహార లోపం కారణంగా రక్తహీనత తదితర వ్యాధులు వస్తాయని తెలిపారు. తక్కువ ఖర్చుతో పోషకాహారం తయారు చేసుకోవటం అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే అందరికీ సంపూర్ణ ఆరోగ్యం

జి.మాడుగుల: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ లసంగి మాలన్న, ఎంపీటీసీ ఎల్. అప్పలరాజు, బొయితిలి సెక్టార్ సూపర్‌వైజర్ కొండమ్మ తెలిపారు. మండలంలో బొయితిలి ఐసీడీఎస్ సెక్టార్ పరిధి సూరిమెట్ట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ముందుగా సర్పంచ్, ఎంపీటీసీలను శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం వెయ్యి రోజుల పోషణ, బాల్యవివాహాలుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల అనర్థాలు ఎక్కువగా ఉన్నాయని, తల్లీబిడ్డల ఆరోగ్యం పాడవుతుందని, ఇలాంటి వాటిని ప్రోత్సహించవద్దని కోరారు. అందరు ఆరోగ్యంగా ఉండటానికి పోషక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, జి.ఎం.ఎ స్.కె, ఆశాలు, తల్లులు పాల్గొన్నారు.

కర్రిముఖిపుట్టులో పౌష్టికాహార మాసోత్సవాల ర్యాలీ



కర్రిముఖిపుట్టులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, గిరిజనులు

ముంచంగిపుట్టు: పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం కర్రిముఖిపుట్టు పంచాయతీలో అంగన్‌వాడీలు సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో వరహాలమ్మ, పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, సూపర్‌వైజర్ రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల నేత అర్జున్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్



వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నేతలు, కార్మికులు

ముంచంగిపుట్టు: మండలంలోని అన్ని పాఠశాలల్లో పని చేస్తున్న శానిటేషన్ కార్మికులకు బకాయి వేతనాలు అందించాలని సీఐటీయూ, గిరిజన సంఘం నేతలు శంకర్‌రావు, ఎంఎం శ్రీను, త్రినాథ్ డిమాండ్ చేశారు. శానిటేషన్ కార్మికుల బకాయి వేతనాలపై శుక్రవారం స్థానిక ఎంఈవో కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో పని చేస్తున్న శానిటేషన్ కార్మికులకు బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అందించాలని, శానిటేషన్ సామగ్రి అందించాలని, లేనిపక్షంలో కార్మికులతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటేషన్ కార్మికులు భాస్కర్‌రావు, శాంతి, గోపాల్, కొండమ్మ, సీతమ్మ, గణపతి పాల్గొన్నారు.